
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 8 జూన్ 2024
5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34.0	27.0
భద్రాద్రి	40.0	25.0

దుక్కులు దున్నుతూ.. విత్తనాలు విత్తుతూ..



- తొలకరి జల్లులతో పత్తి రైతుల్లో ఉత్సాహం
- పల్లెల్లో మొదలైన వ్యవసాయ సందడి
- 60 మి.మీ. వర్షం కురిసిన తర్వాతే విత్తాలి: ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రుక్మిణీదేవి

పంట నేలల్లో ఆశల సాగు షురూ

వైరా/మధిర, జూన్ 7: ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌కు అన్నదాతలు శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలతో భూమి చదును కావడంతో దుక్కులు దున్ని ఉన్న రైతులు విత్తనాలు వేస్తున్నారు. ముఖ్యంగా గురు, శుక్రవారాల్లో అన్ని గ్రామాల్లోని రైతులు విత్తనాలు పెట్టారు. ఒకట్రెండు వర్షాలు మురిపించినప్పటికీ యథావిధిగానే ఎండల తీవ్రత ఉన్నా పట్టించుకోని రైతులు పత్తి, పెసర, జనుముతోపాటు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుంటున్నారు. అందుబాటులో ఉన్న మేలురకంగా భావించిన పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు. రోహిణి కార్తె ముగియడం, ఒకటి రెండు వర్షాలు పడగానే అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు సిద్ధం చేస్తున్నారు. కొందరు మెట్టభూముల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఎక్కడ చూసినా ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలే కన్పిస్తున్నారు. జనుము, పిల్లిపెసర, జీలుగుల పచ్చిరొట్ట విత్తనాలను వెదజల్లుతున్నారు. వారంరోజుల కిందట కొద్దిమంది రైతులు వేసిన పత్తి విత్తనాలు 40శాతం మాత్రమే మొలక రావడంతో వారు ఇప్పుడు మళ్లీ విత్తనాలు పెడుతున్నారు. వాతావరణం అనుకూలించటంతో రైతుల్లో వ్యవసాయంపై ఉత్సాహం కనిపిస్తోంది.

విత్తనాలు నాటేందుకు తొందరపడొద్దు..

వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు విత్తనాలు నాటేందుకు తొందరపడకూడదని అదను కోసం ఎదురుచూడాలని మధిర వ్యవసాయపరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె. రుక్మిణీదేవి సూచించారు. అడపా దడపా పడిన వర్షాలకు తొందరపడవద్దని 60 మి.మీ. వర్షం పడితేనే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఎర్రనేలలైతే 60 మి.మీ. వర్షం పడాలని, నల్లరేగడి నేలలైతే 65-75 ఎం.ఎం. వర్షం నమోదైన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని తెలిపారు. 'ముందుగా ఎండాకాలం లోతు దుక్కులు దుక్కుకొని భూసార పరీక్షలు ప్రతి రైతు చేయించుకోవాలి.. వరి, మిరప పంటలకు ముందుగా జీలుగ, పిల్లిపెసర, పెసర చల్లుకొని పచ్చిరొట్ట పంటలుగా సాగుచేసుకోవాలి.. ఆ తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి.' అని సూచించారు. అంతర్ పంటలుగా కందిలో మొక్కజొన్నగాని, జొన్నగాని, కందిలో పెసరగాని, మినుముగాని, కందిలో పత్తి 1:4 లేదా 1:6 నిష్పత్తిలో సాగుచేసుకోవాలని సూచించారు. పత్తిలో వివిధ కంపెనీలకు చెందిన హైబ్రిడ్ రకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. కాగా, మధిర వ్యవసాయపరిశోధనా స్థానంలో పెసర రకాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంజీజీ-351, ఎంజీజీ-347, ఎంజీజీ-385, ఐపీఎం-2-14., మినుములు పీయూ-31, ఎంబీజీ-1070, కందిలో డబ్ల్యుఆర్‌జీ-255 రకాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

నేడు మృగశిర

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 7: మండే ఎండల నుంచి ఉపశమనం కలిగించే మృగశిర కార్తె శనివారం నుంచి మొదలవనుంది. మృగశిర కార్తెకు వ్యవసాయ పరంగానే కాక, ఆహార, ఆరోగ్య పరంగా కూడా విశేష ప్రాధాన్యం ఉంది. రోహిణి కార్తె వేళ మండే ఎండలతో సతమతమైన ప్రజలు.. తొలకరి జల్లులను మోసుకొచ్చే మృగశిర కార్తె కోసం ఎదురు చూస్తారు. కార్తె ప్రారంభం నుంచే వానాకాలం మొదలవుతుందని, తద్వారా భూగర్భజలాల మట్టం పెరిగి నీటి సమస్య తీరుతుందని భావిస్తారు. మృగశిర కార్తెనాడు చేపలను ఆహారంగా తీసుకుంటే శ్వాసకోశ ఇబ్బందులు తొలగుతాయన్న నమ్మకం ఉండటంతో శుక్రవారం జనం చేపల కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. బొచ్చె, బంగారు తీగ, కట్ల, శీలావతి, తదితర తెల్లచేపలు అధికంగా విక్రయమయ్యాయి. మృగశిర వేళ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని చేపల ధరలు కిలోకు రూ.50 నుంచి రూ.100వరకు పెరిగాయి. శనివారం మరింతగా రేట్లు పెరుగుతాయని భావించి అనేకమంది శుక్రవారం నాడే చేపలను కొనుగోలు చేశారు. దీంతో చేపల మార్కెట్లతోపాటు రహదారుల వెంట కొనుగోళ్ల సందడి కనిపించింది. అలాగే పలువురు ఆయుర్వేద వైద్యులు ఉబ్బస రోగులకు చేప పిల్లలను మందుగా పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారు.

మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు (ఫుడ్ పార్కు) గుర్తుందా..? ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఐడీసీ ఆధ్వర్యంలో 200 ఎకరాల్లో రూ.119 కోట్లతో నిర్మించారు. 2008లో ఈ ప్రాజెక్టుకు పునాది పడగా, 2016లో బీఆర్ఎస్ సర్కారు హయాంలో పూర్తి రూపాన్ని సంతరించుకుంది. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టించాలనేది ప్రభుత్వ సంకల్పం. ఈ పార్కును ఫుడ్ పార్కు జోన్, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌గా విభజించారు. అవసరమైన అన్ని భవనాలను నిర్మించారు. వివిధ రాయితీలు, మౌలిక వసతులు ఏర్పాటు చేసినప్పటికీ ఫుడ్ పార్కు పారిశ్రామిక వేత్తలను ఆకర్షించలేకపోయింది. ఇప్పటివరకు రెండు పరిశ్రమలు ముందుకు వచ్చినా.. అవి పునాది దశను దాటలేకపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగంపై దృష్టి సారించటంతో బుగ్గపాడు ఫుడ్ పార్కుపై ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి తుమ్మల సైతం పట్టుదలతో ఉండటంతో ఫుడ్ పార్కుకు మంచి రోజులు వస్తాయని భావిస్తున్నారు.



మెగా ఫుడ్‌పార్కు ముఖ ద్వారం

ఫుడ్ పార్కులో పూర్తి అయిన కోల్డ్ స్టోరేజి

మెగా ఫుడ్‌పార్కుకు మహర్దశ!



మంత్రి తుమ్మల కృషి

బుగ్గపాడులో వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇప్పటికే ఇక్కడ మామిడి ముక్కలను ప్రాసెస్ చేసే వెగుమంత్ ప్లస్ అండ్ గ్రీన్ సంస్థ తన కార్యకలాపాలు ప్రారంభించింది. జీడి పప్పు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి సిద్ధమైంది. వీటిని మంత్రి తుమ్మల ప్రోత్సహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి తుమ్మల గత డిసెంబర్‌లో మెగా ఫుడ్ పార్కులో అధికారులతో సమావేశమై ఇక్కడి వసతులను సమీక్షించారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మెగా ఫుడ్ పార్కు ప్రారంభోత్సవానికి మంత్రి తుమ్మల ఏర్పాట్లు చేస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించిన సర్కారు

- బుగ్గపాడులో 200 ఎకరాల్లో రూ.119కోట్లతో నిర్మాణం
- వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా ఆహార పదార్థాల తయారీ
- పూర్తి కావస్తున్న మౌలిక వసతులు.. అందుబాటులో రాయితీలు..
- పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు పలు రకాల ప్రోత్సాహకాలు
- అందుబాటులో మామిడి ముక్కలు, జీడి పప్పు ప్రాసెసింగ్ యూనిట్లు
- తరచూ సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జూన్ 7: వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా ఆహార పదార్థాల తయారీకి ఉద్దేశించిన మెగా ఫుడ్ పార్కుకు మహర్దశ పట్టబోతోందా..? గత ప్రభుత్వాల హయాంలో నిరాదరణకు గురైన ఫుడ్ పార్కుకు నూతన వైభవం రాబోతోందా..? రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అవుననే చెబుతున్నాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో గత ప్రభుత్వాల హయాంలో మెగా ఫుడ్ పార్కును ఏర్పాటుచేశారు. మౌలిక వసతుల కల్పనను సైతం పూర్తి చేశారు. అయితే అనేకానేక కారణాల వల్ల ఆశించిన రీతిలో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. గతంలో ఇక్కడ పరిశ్రమలకు స్థలం కేటాయించినప్పటికీ రెండు కంపెనీలు పునాది దశ దాటలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆహారశుద్ధి రంగంపై దృష్టి సారించటంతో బుగ్గపాడులోని ఫుడ్‌పార్కు మళ్లీ తెరపైకి వచ్చింది. ఇక్కడ వ్యవసాయాధారిత కంపెనీల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోంది.

మెగా ఫుడ్‌పార్కు పూర్వపరాలు..

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ సౌజన్యంతో బుగ్గపాడులో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు (ఫుడ్‌పార్కు)ను మంజూరు చేయగా 2008 జనవరి 27న శంకుస్థాపన జరిగింది. దీనికోసం 200 ఎకరాల స్థలాన్ని ఐడీసీ (పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ) ఆధ్వర్యంలో సేకరించారు. ఖమ్మం జిల్లా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో ఈ పార్కును తలపెట్టారు. అయితే ఫుడ్‌పార్కు శంకుస్థాపనతోనే ఆగిపోవటంతో 2016 నవంబర్ 13న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, రోడ్లుభవనాల శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాన చేసారు. ఫుడ్ పార్కు నిర్మాణం పూర్తి అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. కాని ఏళ్లు గడుస్తున్నా ఫుడ్ పార్కు ఏర్పాటు కొలిక్కి రాలేదు.

మౌలిక వసతులు

మెగా ఫుడ్ పార్కును రెండు విభాగాలుగా అధికారులు విభజించారు. ఫుడ్ పార్కు జోన్, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లగా విభజించి మౌలిక వసతులు కల్పించారు. రూ.119 కోట్లు మంజూరు చేయగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాతో పాటు, జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూ.32కోట్లు రుణంతో వసతుల కల్పన చేపట్టారు. 200 ఎకరాల స్థలంలో మొదట్లో నిర్ణయించిన ప్రకారం.... 60 ఎకరాల విస్తీర్ణంలో (మిగతా 6వ పేజీలో)

కాపుకాసి.. కత్తితో పొడిచి..

- భైరవునిపల్లిలో వివాహిత దారుణహత్య
- కొన్నేళ్లుగా భర్తకు దూరంగా నివసిస్తున్న మృతురాలు
- పరారీలో నిందితుడు.. గాలిస్తున్న పోలీసులు



హత్యకు గురైన సైదమ్మ

నేలకొండపల్లి, జూన్ 7: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. ఓ వివాహిత మహిళను గ్రామానికే చెందిన శొంఠి శ్రీను అనే వ్యక్తి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోళ్ల సైదమ్మ(45)కు కోదాడ మండలం కట్టకొమ్ముగూడేనికి చెందిన బూర సైదులుతో వివాహమైంది. వీరికి ఇరువురు కుమారులు. కాగా గత కొన్ని సంవత్సరాలుగా మృతురాలు భర్తకు దూరంగా ఉంటూ సూర్యాపేట జిల్లా కోదాడలోని ఓ ప్రైవేటు కళాశాలలోని బాలికల హాస్టల్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నది. శుక్రవారం రాత్రి సైదమ్మ కోసం కాపు కాసిన శ్రీను, సైదమ్మ ఇంటి సమీపంలోనే మాంసం నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో సైదమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహంపై దాదాపు 11వరకు కత్తి పోట్లు ఉన్నట్లుగా తెలుస్తోంది. మృతదేహాన్ని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. హత్య చేసిన శ్రీను పరారీలో ఉన్నాడు. శ్రీను స్వస్థలం సూర్యాపేట జిల్లా చిలుకూరు. కాగా 30 ఏళ్ల క్రితమే భైరవునిపల్లికి వలస వచ్చి చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు. నిందితుని కోసం గాలిస్తున్నారు. మృతురాలి బంధువులు నిందితుని ఇంటిపైకి వెళ్లి సామాన్లు బయట వేశారు. అదే సమయానికి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా హత్యకు గల కారణాలు తెలియరాలేదు. నాలుగు రోజులుగా నిందితుడు సైదమ్మ కోసం కాపు కాస్తున్నట్లు సమాచారం.

32 గంటల నిర్విరామ గానం

నేడు, రేపు నగరంలో వినూత్న కార్యక్రమం

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 7: స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నగరంలో 32గంటల పాటు కొనసాగే నిర్విరామ గాన కార్యక్రమం శనివారం ప్రారంభం కానుంది. గతంలో నమోదైన జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఘనతలను అధిగమించే విధంగా ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి వరకు కొనసాగిస్తామని నిర్వాహకులు ఇసనపల్లి నగేష్ తెలిపారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 32మంది గాన కళాకారులు పాల్గొని హిట్ చిత్రాల్లోని దాదాపు 400 పాటలను పాడతారని తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం ఉదయం 10గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మార్కెట్‌లో కొనుగోళ్లు షురూ 6

పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమినరీ

- నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి
- ఉదయం 10గంటల తర్వాత లోనికి అనుమతి లేదు
- అధికారులకు కలెక్టర్ గౌతమ్ దిశా నిర్దేశం



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 7: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం చేపట్టనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో మొత్తం 52సెంటర్లలో 18,403 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవనున్నట్టు చెప్పారు. అభ్యర్థులు ఒక రోజు ముందే తమ పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవాలన్నారు. అభ్యర్థుల హాల్ టికెట్స్ టీజీపీఎస్సీ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9గంటలకే చేరుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో ఉదయం 10గంటలకు గేట్లు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా అభ్యర్థులను తనిఖీలు చేయడానికి, ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష హాలులో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి వెంట తెచ్చుకోవాలన్నారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించుకొని, సొంత డిక్లరేషన్ రాసి ఇవ్వాలని, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్ డిపార్ట్మెంట్ అధికారులకు కూడా సెల్‌ఫోన్‌లు అనుమతిలేదని అన్నారు. అభ్యర్థులు షూస్, జ్యూవెల్లరీ వేసుకొని రాకూడదని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్, వాచ్, రైటింగ్ ప్యాడ్‌లకు అనుమతిలేదని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్లు విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్‌బాబు, ఎస్బీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజకుమార్, జిల్లా అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంటు పాల్గొన్నారు.

వనరులున్నా ఆదాయమేదీ!?

- పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం
- పెంపునకు నోచుకోని దుకాణాల అద్దెలు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజులపైనా అలసత్వం
- ఖమ్మం నగర పాలక సంస్థ తీరు

ప్రత్యేక కథనం : 6లో

ఫలించిన తుమ్మల కృషి

- మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ
- గత ఎన్నికల్లో నమోదైన రికార్డులు బద్దలు
- బలరాంనాయక్‌కు 3,49,165 ఓట్ల మెజారిటీ దక్కడంలో కీలకపాత్ర
- ఏజెన్సీలో మరోసారి పట్టుచాటుకున్న నేత

ప్రత్యేక కథనం : 7లో



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద అనుచరులతో తీన్మార్ మల్లన్న విజయోత్సాహం

మల్లన్న ఎన్నిక లాంఛనమే..

- ఉత్కంఠభరితంగా సాగిన లెక్కింపు
- ఎవరికీ రాని కోటా ఓటు
- మూడో ప్రయత్నంలో దక్కిన విజయం
- అన్ని రౌండ్లలోనూ ఆధిక్యం
- కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల విజయోత్సాహం

వివరాలు : 6లో


విదేశీ ప్రతినిధులతో తుమ్మల రాణాప్రతాప్

గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో
వల్లాపురం రైతు

వైరా, జూన్ 7:హైదరాబాద్‌లో శుక్ర, శనివారాల్లో జరిగే 2020-24 గ్లోబల్ రైస్ సమ్మిట్లో వైరా మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు తుమ్మల రాణాప్రతాప్ రైతుప్రతినిధిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో రెండురోజులపాటు గ్లోబల్ రైస్ సమ్మిట్ జరుగుతుంది. దేశ, విదేశాల నుంచి జాతీయ స్థాయిలో శాస్త్రవేత్తలు, తెలంగాణ రాష్ట్రం నుంచి 28మంది రైతులు పాల్గొన్నారు. ఈ 28మంది రైతుల్లో రైతు ప్రతినిధిగా పాల్గొన్న వారిలో రాణాప్రతాప్ ఒకరు. జిల్లానుంచి నల్లమల వెంకటేశ్వరరావు, మంకెన రామకృష్ణ, రామిరెడ్డి కూడా పాల్గొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

రాజీమార్గంతో..
శాంతి సామరస్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

ఖమ్మం లీగల్, జూన్ 7: లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లయితే అది సమాజంలో శాంతి సామరస్యాన్ని పెంచుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం న్యాయమూర్తి జ్యుడీషియల్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో లోక్‌అదాలత్ పరిష్కార ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో ఇరుపక్షాల వారు సామరస్య పూర్వకంగా రాజీపడితే అది వారి మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందన్నారు.లోక్ అదాలత్ ప్రక్రియను అనుసరించేటప్పుడు ఆయా విషయాలపై గౌరవ సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కేవీ చంద్రశేఖరరావు, కే దీప, బి.రజిని, వై.బిందుప్రియ, వి.మాధవి ప్రాసిక్యూటింగ్ అధికారులు కృష్ణ మోహన్, నరసయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించనున్న జిల్లా జడ్జి

జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఉదయం 10గంటలకు న్యాయ సేవాసదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించనున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావుతో సహా న్యాయవాదులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికిగాను ఖమ్మంలో ఏడు లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఆయా న్యాయమూర్తులు పరిష్కరించనున్నారు.

మల్లన్న ఎన్నిక లాంఛనమే..

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం దాదాపు ఖాయమైంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి కంటే మల్లన్నకు ఎక్కువ ఓట్లుండడంతో మల్లన్నను అధికారికంగా విజేతగా ప్రకటించేందుకు ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని మల్లన్న గెలుపుని అధికారికంగా ప్రకటించడమే లాంఛనంగా మిగిలింది.

మూడు రోజులపాటు సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ మల్లన్న ఆధిక్యతను చాటితే రాకేష్‌రెడ్డి సైతం బలమైన ఓట్లను సాధిస్తూ వచ్చారు. చివరి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నడుమ పోటాపోటీ నెలకొనడంతో చివరివరకు ఉత్కంఠ కొనసాగింది. అశోక్‌కుమార్ మినహా మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు 48మంది ఓట్లలోనూ ఎలిమినేషన్‌లో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డికి దాదాపు సమానంగా ఓట్లు వచ్చాయి. మొత్తం 52మంది అభ్యర్థులలో రాత్రి పది గంటల వరకు అధికారికంగా ప్రకటించిన ప్రకారం మొదటి 47 మంది స్వతంత్ర అభ్యర్థుల బ్యాలెట్ల నుంచి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కలుపుకొని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,24,899 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,05,524 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 30,461 ఓట్లు వచ్చాయి. ఈ ఎలిమినేషన్ల తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు జడ్సన్, పాలకూరి అశోక్‌కుమార్‌తో పాటు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ కూడా రాత్రి పదిలోపు పూర్తయింది. అప్పటికీ మల్లన్నకే ఆధిక్యత ఉన్నప్పటికీ కోటా ఓటుకు చేరకపోవడంతో ఎన్నికల సంఘం అనుమతి మేరకు అయన్ను విజేతగా ప్రకటించే ప్రక్రియను చేపట్టారు.

ఎవరికీ రాని కోటా ఓటు

స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ ఎలిమినేషన్ తర్వాత బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆయనకు వచ్చిన 43,313 బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యతలోనూ ఎవరికీ ఏకపక్షంగా ఓట్లు పడలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి బీజేపీ క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలుండడం, ఆయన ఇటీవలి వరకు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసి ఉన్న నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటేసిన ఓటర్లలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేస్తారని భావించినా వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు గణనీయమైన ఓట్లు రావడంతో ఆయనే మంచి మెజార్టీతో ఆధిక్యతలో ఉన్నారు. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల అనుమతితో సాంకేతిక వెసులుబాటు మేరకు మల్లన్నను విజేతగా ప్రకటించే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన చేపట్టారు. తీన్మార్ మల్లన్న 2015లో మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు.

అరకొరగానే విద్యుతుత్పత్తి

- పాలేరు జలవిద్యుత్ కేంద్రంపై వర్షాభావ ప్రభావం
- సాగర్ జలాలు విడుదల కాక.. ఆశించినస్థాయిలో కాని ఉత్పత్తి

కూసుమంచి, జూన్ 7: గతేడాది వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపైనే కాకుండా, విద్యుదుత్పత్తిపైనా ప్రభావం చూపించాయి. కూసుమంచి మండలం పాలేరులోని జలవిద్యుత్ కేంద్రంలో గతేడాది (2023-24) విద్యుదుత్పత్తి అరకొరగానే జరిగింది. ఏడాది పొడవునా సరైన వర్షాలు లేకపోవడంతో పాలేరు జలాశయంలో నీరు సరిగా చేరకపోవడం, రెండోజోన్‌కు నీరు విడుదల చేయకపోవడంతో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తికి అవకాశం లేకుండా పోయింది. దీంతో అతి తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తికోసం ఏర్పాటుచేసిన ప్రాజెక్టులో.. గత కొద్ది సంవత్సరాలుగా ఎదురవని ప్రతికూల పరిస్థితి ఏర్పడింది.

పాలేరు జలాశయానికి, సాగర్ ఎడమకాల్వకు అనుసంధానంగా పాలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. 23అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం కలిగిన పాలేరు జలాశయంలో కనీసం 18అడుగుల మేర నీరు నిల్వ ఉంచడంతో పాటు, కాల్వలో కనీసం 2400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్న సమయంలో రెండు యూనిట్ల ద్వారా రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. జలాశయం నీటిమట్టానికి, కాల్వలో నీటిమట్టానికి కనీసం 8 అడుగుల వ్యత్యాసం ఉండటంతో కాల్వ నీటి ప్రవాహం, జలాశయంలో నీటి ఒత్తిడితో టర్బైన్‌లపై ప్రెజర్ పెరిగి విద్యుదుత్పత్తి జరిగే విధంగా ప్రాజెక్టు నిర్మించారు. బయట మార్కెట్‌లో రూ.4నుంచి 8 వరకు ఒక్క యూనిట్ విద్యుత్ కొనుగోలు చేస్తుండగా, పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒక్క యూనిట్‌కు అతితక్కువగా రూ.0.50 పైసలు మాత్రమే ఖర్చవుతుంది. సాగర్ పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ డ్యామ్‌లో నీరు చేరక క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈక్రమంలో ఎడమకాల్వకు నీరు విడుదల కాలేదు. అయితే వానాకాలంలో, యాసంగిలో ఖమ్మంజిల్లాలో కొంతమేర సాగులో ఉన్న పంటలను కాపాడటం కోసం, ఖమ్మంనగరానికి తాగునీరు అందించేందుకు అప్పుడప్పుడు పాలేరు జలాశయం నుంచి ఎడమకాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. ఆసమయాల్లో అవకాశం ఉన్నమేర జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తి చేశారు.

0.038 మిలియన్‌ల విద్యుతుత్పత్తి

పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో గతేడాది మొత్తం మీద 41రోజులపాటు (629 గంటల పాటు) అడపాదడపా విద్యుదుత్పత్తి జరిగింది. రెండు యూనిట్ల ద్వారా 0.038 మిలియన్‌ల (3,80,758 యూనిట్లు) విద్యుదుత్పత్తి జరిగింది.


పాలేరు జలవిద్యుత్‌కేంద్రం

ప్రాజెక్టును ఆధునీకరించాలి

పాలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని ఆధునీకరించాలి. 1994లో అప్పటి విద్యుత్ శాఖామంత్రి సంబాని చంద్రశేఖర్ మంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టును నిర్మించారు. అప్పటినుంచి నిరాటంకంగా విద్యుతుత్పత్తి జరిగే విధంగా డిజైన్ చేశారు. పాలేరు జలాశయంలో 18 అడుగుల మేర నీరు నిల్వ ఉండి, ఎడమ కాల్వలో కనీసం 2400 క్యూసెక్కుల నీరు ప్రవహించినప్పుడు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. అలా కాకుండా ఎంత నీరు ప్రవహించినా విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ప్రాజెక్టును ఆధునీకరించాలి. అందుకోసం ప్రాజెక్ట్ కాల్వ డౌన్ స్ట్రీమ్‌ను కొంత లోతు పెంచి, కాల్వను ఒక కిలోమీటరు తర్వాత ఎడమకాల్వకు అనుసంధానం చేయాలని అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టు నిర్మాణం జరిగి మూడున్నర దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా జనరేటర్లు, టర్బైన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అతితక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నందున ప్రాజెక్టును ఆధునీకరిస్తే మరింత లాభం చేకూరే అవకాశం ఉంది.

ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నాం: దేశ్యానాయక్, ఎస్ఈ పులిచింతల

గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రెండోజోన్‌కు సాగర్ జలాలు సరిగా విడుదల కాకపోవడంతో జలవిద్యుత్ కేంద్రంలో విద్యుతుత్పత్తి ఆశించినస్థాయిలో జరుగలేదు. ఒకవేళ వచ్చే సీజన్‌కు ఎప్పుడు సాగర్ జలాలు విడుదల చేసినా.. విద్యుతుత్పత్తి జరిగేవిధంగా ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నాం. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నాం.


విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను అభినందిస్తున్న పీవో

ఐఐఎం, ఐఐటీల్లో సీట్లు సాధించడం
తోటి విద్యార్థులకు స్ఫూర్తి

భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జూన్ 7: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఐఐఎం, ఐఐటీల్లో సీట్లు సాధించి తోటి విద్యార్థినులకు విద్య పట్ల మక్కువ కలిగించి వారిలో స్ఫూర్తి నింపడానికి మార్గదర్శకంగా నిలవడం ఎంతో సంతోషమని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఐఐఎం, ఐఐటీల్లో సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులు పాయం ప్రవల్లిక, బానోతు స్వాతి, వజ్జా మానసలను పీవో అభినందించారు. ఈ సందర్భంగా పీవో ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ దేశంలోనే ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించి పుట్టి పెరిగిన గ్రామాలకు పేరు తేవడం సంతోషకరమన్నారు. విద్యార్థినుల పై చదువులకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. సీఏటీ, ఎంబీఏ కోర్సులో 66.5శాతం సాధించిన ప్రవల్లికకు ల్యాప్‌టాప్‌ను అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్సీవో వెంకటేశ్వరరాజు, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు అనురాధ, సునీత, కృష్ణ, స్పందన పాల్గొన్నారు.


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన బస్తాలు

వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు షురూ

తేజా రకం మిర్చికి రూ.20వేల ధర

ఖమ్మం మార్కెట్, జూన్ 7: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సుమారు 24రోజుల వేసవి సెలవుల అనంతరం మార్కెట్‌లో తిరిగి లావాదేవీలు పునఃప్రారంభం అయ్యాయి. కాగా శుక్రవారం మార్కెట్‌కు పంట ఆశించిన స్థాయిలో అమ్మకానికి రాలేదు. మార్కెట్‌కు సుమారు 14మంది రైతులు 34బస్తాల సాధారణ రకం (నాన్ ఏసీ) తేజ మిర్చి బస్తాలను తీసుకురాగా, 10 తాలు మిర్చి బస్తాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి. అంతే కాకుండా ఏడుగురు రైతులకు చెందిన కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచిన సుమారు 223 ఏసీ మిర్చి బస్తాలు ఖరీదులు కాగా.. పత్తి 99 బస్తాలు, పెసలు 9 బస్తాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి. దీంతో మార్కెట్‌లో సాధారణ రకం నాన్ ఏసీ తేజ మిర్చికి క్వింటాలు రూ.16,200 జెండా పాట ధర పలకగా ఏసీ మిర్చిని క్వింటాలు రూ.20వేల ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. పత్తి క్వింటాలు గరిష్టంగా రూ.7,050 పలకగా, కనిష్టంగా రూ.4,000 పలికింది. పెసలను రూ. క్వింటాలు రూ.6,700 నుంచి 7,000 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్లో కొనుగోళ్లను సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్-టూ సెక్రెటరీ బజారు సమీక్షించారు.

లక్షణంగా వృథా

- కూలీలకు అందాల్సిన ఓఆర్ఎస్ దశలవారీగా పక్కదోవ
- వైద్యశాఖ నుంచి తెచ్చి డీఆర్‌డీఏలో దుర్వినియోగం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 7: జిల్లాలో దశాబ్ద కాలంలో లేని ఎండలు ఈ ఏడాది మండాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వడదెబ్బ నుంచి నివారణకు కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య శాఖ నుంచి లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లను జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు సరఫరా చేయించారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. ఉన్నతాధికారుల లక్ష్యం నెరవేరలేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉపాధి కూలీలకు చేరలేదు. డీఆర్‌డీఏ కార్యాలయంలోనే ఓఆర్ఎస్ బాక్స్‌లను ఉంచారు. నెలల తరబడి ఉంచటంతో ఓఆర్ఎస్ బాక్స్‌లకు చెదలు పట్టి బాక్స్‌లు చినిగిపోయాయి. ఇంకేముంది ఉద్యోగులు, అధికారులు ఓఆర్ఎస్ బాక్స్‌లు, ప్యాకెట్లు సొంతానికి తీసుకెళ్లారు. కూలీలకు చేరాల్సిన ఓఆర్ఎస్‌ను ఇతర అవసరాలకు అధికారికంగా వినియోగించి దుర్వినియోగం చేశారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపాధి కూలీలకు చేర్చాలి లేకుంటే వైద్యశాఖకు తిరిగి పంపితే ప్రాణాపాయం ఉన్నవారికి ప్రయోజనకరంగా మారతాయి.


డీఆర్‌డీఏలో మూలకు చేరిన ఓఆర్ఎస్ బాక్స్‌లు

మెగా ఫుడ్‌పార్క్‌కు మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

పరిపాలన భవనం, కోల్డ్ స్టోరేజీ, వేర్ హౌస్, ప్యాకింగ్ హౌస్, గోదాములు, ట్రీట్‌మెంట్ ప్లాంట్, వే బ్రిడ్జి, విద్యుత్ సబ్‌స్టేషన్, స్టాండర్డ్ డిజైన్ ఫ్యాక్టరీ రహదారులు, ప్రహరీ, డ్రైనేజీ, వాటర్ ప్లాంట్లు, సెంట్రల్‌లైటింగ్ నిర్మించారు. టీఎస్ఐఐసీ ద్వారా ఇక్కడ మౌలిక వసతుల కోసం నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం కేటాయించిన 85 ఎకరాల్లో ప్రస్తుతం రహదారుల నిర్మాణం వేగంగా సాగుతోంది.

కాంగ్రెస్ సర్కారు దృష్టి

మెగా ఫుడ్ పార్క్‌లో మౌలిక వసతులు పూర్తి కావటంతో ఇక్కడ పరిశ్రమలు స్థాపించే దిశగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. పరిశ్రమలు ఏర్పాటు చేయటం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం, కూరగాయలు, జామ, సపోటా, మామిడి, నిమ్మ, మొక్కజొన్న, కొబ్బరి, కోకో తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చేయవచ్చని ప్రభుత్వ భావిస్తోంది. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో కూడా రైస్ మిల్లులు, మాంసం, చేపల ప్రాసెసింగ్, ఆయిల్‌పామ్ అనుబంధ యూనిట్లు, నూనెల తయారీ, వ్యవసాయ ఉత్పత్తులతో స్నాక్స్ తదితర యూనిట్లు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

భారీగా ప్రోత్సాహకాలు

ఫుడ్ పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్థలం కేటాయించిన సందర్భంగా స్టాంపుడ్యూటీ మినహాయింపు, ప్లాట్ల ధరలో రాయితీ, అయిదేళ్ల పాటు విద్యుత్ బిల్లులో రాయితీ, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలను పారిశ్రామిక వేత్తలకు వివరించి పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానించాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు.

పరిశ్రమలు వస్తే రైతులకు మేలు

మెగా ఫుడ్ పార్కులో పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటైతే ఉమ్మడి ఖమ్మం జిల్లా సహా నల్గొండ, వరంగల్ జిల్లాలోని రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఉద్యానవన పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే కొత్త పంటలను కూడా ప్రయోగాత్మకంగా చేపట్టే అవకాశం ఉంది. పరిశ్రమల వల్ల రైతుల ఉత్పత్తులకు భారీగా డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

వనరులున్నా ఆదాయమేదీ?

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ▸ పెంపునకు నోచుకోని దుకాణాల అద్దెలు ▸ ట్రేడ్ లైసెన్స్ ఫీజులపైనా అలసత్వం ▸ ఖమ్మం నగర పాలక సంస్థ తీరు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 7: ఖమ్మం నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయాన్ని పెంచుకునే దిశగా దృష్టి సారించకపోవటంతో ప్రభుత్వం నుండి వచ్చే నిధులపైనే ఆధార పడాల్సి వస్తున్నది. దీంతో అభివృద్ధి పనులు చేసినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం నగరపాలకసంస్థకు వచ్చేఆదాయం కార్యాలయ నిర్వహణ, విద్యుత్తుబిల్లుల చెల్లింపు, ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నది. ఖమ్మం నగరపాలకసంస్థకు ప్రధాన ఆదాయవనరులు ఆస్తిపన్ను, ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు, దుకాణాల అద్దెలు, పంపు పన్నులు. అయితే వీటిని సక్రమంగా వసూలు చేస్తే నగరపాలకసంస్థ ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగే అవకాశం ఉంది.

ఏడాదికి రూ.30 కోట్లే...

నగరంలో సుమారు 72 వేల నివాసాలు ఉండగా, పూర్తిస్థాయిలో ఆస్తిపన్నులు వసూళ్లు చేయలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏకైక కార్పొరేషన్ అయినప్పటికీ ఆస్తిపన్నుల ద్వారా ఏడాదికి రూ.30కోట్లకు మించి ఆదాయం రావటం లేదు. ప్రతి ఆరునెలలకు ఒకసారి నివాసాలను, వాణిజ్య ప్రాంతాలను పరిశీలించి, అదనంగా నిర్మాణం చేపడితే ఆస్తిపన్నులను సవరించాలి. దీనివల్ల ఆస్తిపన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఏడాదికి సుమారు రూ.50కోట్లకు పెంచవచ్చని ఒక అంచనా. ప్రతి ఏడాది అవే డిమాండ్ నోటీసులు ఇవ్వటంతో ఆస్తిపన్నుల ద్వారా వచ్చే ఆదాయం పెరగటంలేదు.

అద్దెల ద్వారా రూ.60 లక్షలు

నగరపాలకసంస్థకు చెందిన దుకాణాలకు సంబంధించి అద్దెల ద్వారా ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం వస్తున్నది. అయితే అద్దెల వసూళ్లలలో సిబ్బంది నిర్లక్ష్యం, లీజుకు తీసుకున్నవారు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవటంతో ఏడాదికి రూ.40 లక్షలకు మించి ఆదాయం రావటం లేదు. నగరపాలకసంస్థకు పాతబస్టాండ్, స్టేషన్‌రోడ్, పెవిలియన్‌గ్రౌండ్, వైరారోడ్, పాత మెప్మాకార్యాలయం సమీపంలో దుకాణాలు ఉన్నాయి. పాతబస్టాండ్ సమీపంలో 20 దుకాణాలు ఉండగా, స్టేషన్‌రోడ్‌లో 60, పెవిలియన్ గ్రౌండ్ సమీపంలో 5, పాత మెప్మా కార్యాలయం సమీపంలో 6 దుకాణాలు ఉన్నాయి. కాగా వైరా రోడ్‌లో 19 దుకాణాలు ఉండగా, ఆ స్థలంలో వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని సదరు దుకాణాలను కూల్చివేశారు. అయితే అక్కడ మార్కెట్‌ను నిర్మించకుండా వీడీవోస్ కాలనీలో నిర్మించారు. దీంతో సదరు 19 దుకాణాల అద్దెలను నగరపాలక సంస్థ కోల్పోయింది.

నగరపాలకసంస్థకు సంబంధించిన దుకాణాలను తక్కువ అద్దెలకే ఇచ్చారు. దుకాణాలను బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.15 వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. స్టేషన్‌రోడ్‌లో రూ.5 వేలకే అద్దెకు ఇస్తున్నారు. పెవిలియన్‌గ్రౌండ్ ప్రాంతంలో దుకాణాలకు భారీగా అద్దెలు ఉన్నప్పటికీ నగరపాలకసంస్థకు చెందిన దుకాణాలకు తక్కువ అద్దెలు చెల్లిస్తున్నారు. అద్దెలు పెంచాలని నగరపాలకసంస్థ నిర్ణయించినప్పటికీ, దుకాణాలు తీసుకున్నవారు రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావటం, దుకాణాలకు ఖాళీ చేయమంటే కోర్టులను ఆశ్రయించటం వంటివి చేస్తున్నారు. దీంతో అద్దెలు పెంచే ప్రతిపాదనలను అధికారులు విరమించుకున్నారు. అంతేకాకుండా దుకాణాలను అద్దెలకు తీసుకున్నవారు వేరే వ్యక్తులకు ఎక్కువ రేట్లకు అద్దెలకు ఇచ్చి భారీగా లాభ పడుతున్నారు. ఖమ్మం నగరంలో ప్రైవేటు దుకాణాల అద్దెలు నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండగా, నగరపాలకసంస్థ వారు మాత్రం నెలకు రూ.5వేలనుంచి రూ.15వేలు మాత్రమే వసూలు చేస్తున్నారు.

వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం

పంపు (కుళాయి) పన్ను బకాయిలు కూడా భారీగా పేరుకుపోయాయి. ఏడాదికి పంపుపన్నులు రూ.9 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.2.48కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. పంపుపన్ను నెలకు రూ.110 వంతున ఏడాదికి రూ.1320 వసూలు చేయాలి. పంపుపన్నులకు సంబంధించి డిమాండ్ నోటీసులు తొలినుంచి ఇవ్వకపోవటంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. నగరంలో నగరపాలకసంస్థకు సంబంధించి సుమారు 35వేల పంపు కనెక్షన్‌లు ఉండగా, ఇప్పటి వరకు 11,213 కనెక్షన్‌లకు సంబంధించి మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారంటే వసూళ్లు ఎంత మందకొడిగా సాగుతున్నాయో అర్థం అవుతున్నది.

ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లు అంతంతే.

ఖమ్మం నగరపాలకసంస్థకు ప్రధాన ఆదాయ వనరు ట్రేడ్‌లైసెన్స్ ఫీజులే. నగరంలో సుమారు 7వేల దుకాణాలు ఉండగా, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల ద్వారా ఏడాదికి రూ.3కోట్ల పైగా వసూలు కావాల్సిఉంది. అయితే కోటి రూపాయలకు పైగానే వసూలు చేయగలుగుతున్నారు. ట్రేడ్‌లైసెన్స్ ఫీజలను ప్రభుత్వం భారీగా పెంచిన నేపథ్యంలో దానిని సవాల్ చేస్తూ నగరంలోని ఆసుపత్రులు యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించటంతో వాటి ద్వారా వచ్చే ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు నిలిచిపోయాయి. అలాగే వైన్సులు, బార్లకు సంబంధించి అనేకమంది యజమానులు ట్రేడ్‌లైసెన్స్ ఫీజలు చెల్లించటం లేదు. అధికారులు సైతం వాటిపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అలాగే పలు రెస్టారెంట్లు, హోటళ్లకు ట్రేడ్‌లైసెన్స్‌లు ఉన్నాయో, లేదో తెలియని పరిస్థితి. షాపింగ్‌మాల్స్ నుండి తక్కువ మొత్తంలోనే ట్రేడ్‌లైసెన్స్ ఫీజలు చెల్లిస్తున్నారు. కాగా గతంలో ట్రేడ్‌లైసెన్స్ ఫీజులను ఆన్‌లైన్ చేయకపోవటంతో మూడేళ్లపాటు ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల వసూళ్లను నిలిపివేశారు. ఈ ఫీజులపై దృష్టిసారిస్తే నగరపాలకసంస్థకు కోట్లాదిరూపాయలు ఆదాయం వస్తుంది.

నూతర మాస్టర్‌ప్లాన్ లేకపోవటంతో...

నూతన మాస్టర్‌ప్లాన్ లేకపోవటంతో నిర్మాణ అనుమతులు జారీలేక నగరపాలకసంస్థ ఇప్పటికి సుమారు రూ.50కోట్ల ఆదాయం కోల్పోయింది. పాతమాస్టర్‌ప్లాన్‌లోనే కొన్ని మార్పులు చేసి నిర్మాణాలకు అనుమతులను ఇస్తున్నారు. నూతన మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను ప్రభుత్వానికి పంపి, అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. పాలకవర్గం ఇప్పటికైనా పట్టించుకొని మంత్రుల దృష్టికి తీసుకువెళితే నగరపాలకసంస్థకు భారీ ఆదాయం లభిస్తుంది.



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం


స్టేషన్ రోడ్ కార్పొరేషన్ దుకాణాలు

రాష్ట్ర అథ్లెంటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో
భద్రాద్రికి 22 పతకాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్07: 10వ తెలంగాణ రాష్ట్ర సీనియర్, యూత్ అథ్లెంటిక్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెంటిక్స్‌లు 22 పతకాలు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. శుక్రవారం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ముగిసిన ఈ పోటీలలో జిల్లాలో 30 మంది అథ్లెంటిక్స్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా 22 పథకాలు వరించాయి. వీటిలో 7 బంగారు పతకాలు, 11 రజిత పతకాలు, 4 కాంశ్యా పతకాలు సాధించారు. అదేవిధంగా 48 పాయింట్‌లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ భద్రాద్రి జిల్లా సాధించినట్లు ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్ హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన
ఆన్‌లైన్ శిక్షణా తరగతులు

అశ్వారావుపేట, జూన్ 7: ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్థానిక వ్యవసాయ కళాశాలలోని విస్తరణ విబాగం వారు నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. వ్యవసాయ విస్తరణ విబాగంలో పేరుగాంచిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ సౌజన్యంతో వ్యవసాయ కళాశాలలో డాక్టర్ టీ శ్రావణ్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో డా. వినీత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ కళాశాలలో ఇదే తరహా శిక్షణ తరగతులు మరెన్నో జరగాలని సూచించారు. ఈ శిక్షణలో వ్యవసాయ వ్యాపార అంశాలపై దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు.


వ్యవసాయ కళాశాల నుంచి ఆన్‌లైన్‌లో శిక్షణ

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలలో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని ప్రతిభ



పతకం అందుకుంటున్న సింధుప్రియ

ఖమ్మం స్పోర్ట్స్/తల్లాడ జూన్ 7: హన్మకొండలో ఈనెల 6న జరిగిన 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ధర్మసోత్ సింధుప్రియ ప్రతిభ చూపి రజత పతకం సాధించింది. అండర్- 20 బాలికల విభాగంలో సింధుప్రియ 400 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ ప ద్మావతి, కోచ్ వీర రాఘవులు, అధ్యాపకులు రాకేష్‌శ్రీరా మ, రామకుమారస్వామి, మార్షియానా తదితరులు అభినందించారు. సింధుప్రియ స్వగ్రామం తల్లాడ మండలం రంగంబంజర. ఆమె తల్లిదండ్రులు ధర్మసోత్ దశరథ్‌నాయక్, శిల్పా. సింధుప్రియను గ్రామ స్థులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు.

ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో నిర్మాణాలు పూర్తిచేయండి

» జగన్నాథపురంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు



నిర్మాణాలను పరిశీలిస్తున్న జీఎం షాలేంరాజు

సత్తుపల్లి, జూన్ 7: సత్తుపల్లి మండలంలోని జగన్నాథపు రం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవనా లను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురా వాలని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు సివిల్ అధి కారులకు సూచించారు. సెంటర్‌ను ఆయన శుక్రవారం సంద ర్శించారు. నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పా ఠశాల, గుడి, చర్చ్, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవన ని ర్మాణ పనుల స్థితిగతులను తెలుసుకుని పలు సూచనలు చే శారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల పరిధు లలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై వివరణ కోరా రు. ప్రమాదాల దృష్ట్యా వాహనదారులకు రక్షణ సూచికలు, వేగం నియంత్రణ, రోడ్డు అంచులు చూపే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు, సివిల్ అధికారి ఎస్ఈ రవికుమార్ ఉన్నారు.

ఫలించిన తుమ్మల కృషి

» మహబూబాబాద్‌లో కాంగ్రె‌స్‌కు రికార్డు స్థాయి మెజారిటీ
» గత రికార్డుల బద్దలు
» బలరాంనాయక్‌కు 3,49,165 ఓట్లు మెజారిటీ దక్కడంలో కీలకపాత్ర
» ఏజెన్సీ వ్యాప్తంగా మరోసారి పట్టు చాటుకున్న నేత

ఇల్లెందు, జూన్ 7: మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు అవిశ్రాంతంగా సాగించిన కృషి. కాంగ్రెస్ అపూర్వ విజయానికి తోడ్పడింది. గతంలో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గెలు పొందిన అభ్యర్థుల మెజార్టీలను తాజా ఎన్నికల్లో తిరగరాశారు. ఏఐసీసీ మహబూబాబాద్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడంతో రెయింబవళ్లు పోరిక బలరాంనాయక్ విజయం కోసం తుమ్మల కృషి చేశారు. ఏజెన్సీ ప్రాంతాలతో కూడిన మానుకోట లోక్‌సభ నియోజకవ ర్గంపై తుమ్మల కు గట్టి పట్టు ఉండటం మారుమూల గ్రామాల మౌలిక వసతుల కల్పనకు నాలుగు దశాబ్దాలుగా ఆయన చేసిన సేవలు.. అన్ని వర్గాల ప్రజలతో పాటు విపక్ష రాజకీయ నాయకులతో సైతం సన్నిహిత సంబంధాలు కలిగివుండటం మానుకోటలో ఘన విజయానికి ప్రధాన భూమిక పోషించాయనడం అతిశయోక్తి కాదు.

మానుకోట లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం, ములుగు శాసనసభ నియోజకవర్గాల్లో ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించి తాను పదవులో ఉన్నా.. లేకపోయినా.. ప్రజలకు అండగా ఉంటూ మౌలిక సౌకర్యాలు కల్పించారన్న భావన, అభిమానం ఏజెన్సీ ప్రాంతాల ప్రజల్లో నెలకొన్నది. ఈ క్రమంలోనే తుమ్మల లోక్‌సభ స్థానంలో అన్ని ప్రాంతాల్లోను భారీ ఆధిక్యాలు సాధించ గలిగారని పరిశీలకులు పేర్కొంటున్నారు.

ప్రత్యేకించి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ నియోజకవర్గాల్లో నిలిచిపో యిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల (ఎల్‌డబ్ల్యూఈ) అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ డిల్లీ, తమిళనాడుల్లోని కేంద్ర అటవీ పర్యావరణ శాఖల ఉన్నతాధికారులతో తుమ్మల చర్చలు జరుపుతూ పలుమార్లు చర్చించి అటవీశాఖ క్లియరెన్సులు సాధించడం లాంటి పను లతో ఏజెన్సీ ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొన్న నేపధ్యంలోనే ఏజెన్సీ ప్రజలు తుమ్మల పిలుపును సిరసావహించారని బావిస్తున్నారు.

ఏజెన్సీలో మంత్రి తుమ్మలకు ఉన్న పట్టు కారణం గానే కాంగ్రెస్ నాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆయ నను మానుకోట లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారన్న ప్రచారం కూడా లేకపోలేదు. వేసవి వడగాలులు ఖాతరు చేయకుండా ఎన్నికల ప్రచారాలను, సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర సభను విజయవంతం చేయటంలో తుమ్మల వ్యూహాలే కారణాలుగా పేర్కొంటున్నారు. ఒక వేపు ఇన్‌చార్జ్‌గా మానుకోట ఎన్నికల ప్రచారాలు వ్యూహాల్లో తనదైన మార్క్ చూపుతూనే మరోవైపు ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి విజయం కోసం పనిచేయడం గమనార్హం.

అన్ని సెగ్మెంట్లలోను భారీ ఆధిక్యాలే..

మంత్రి తుమ్మల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేసిన మాను కోట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్‌నాయక్‌కు భారీ మెజార్టీలు లభించడం గమనార్హం. శాసనసభ ఎన్నికల్లో లభించిన ఆధిక్యా లను మించి లోక్‌సభ ఎన్నికల్లో 7 నియోజకవర్గాలోను భారీ మెజార్టీలు సాధించడంలో తుమ్మల వ్యూహం ఫలించినట్లు బావిస్తున్నా రు. లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాలోత్ కవితపై కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్‌కు ఇల్లెందు నియోజకవర్గంలో 59,299 ఓట్లు, పినపాకలో 49,319 ఓట్లు, భద్రాచలంలో 34,231 ఓట్లు, జోర్నకల్‌లో 45,013 ఓట్లు, మహబూబాబాద్‌లో 49,883 ఓట్లు, ములుగు సెగ్మెంట్‌లో 53,233 ఓట్లు నర్సంపేట సెగ్మెంట్‌లో 55,111 ఓట్ల మెజార్టీలు సాధించడం విశేషం.

లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో గత శాసనసభ ఎన్నికల్లో భద్రా చలం మినహా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో అందరికి మొత్తం 2,41,987 ఓట్లు లభించగా.. లోక్‌సభ ఎన్నికల్లో తుమ్మల వ్యూహాలు ఫలించడంతో 3,49,165 ఓట్లు మెజార్టీ సాధించడం సంచల నంగా మారింది.



మండుటెండల్లో ప్రచారం సాగించిన మంత్రి తుమ్మల (ఫైల్)

అంతేకాక ఈ మెజార్టీ మానుకోటలో జరిగిన మూడు ఎన్నికల్లోను ఏ పార్టీకి లభించకపోవడం గమనార్హం. 2009లో పోరిక బలరామ్ నాయక్ 68,975 ఓట్ల మెజార్టీతో.. 2014లో బీఆర్ఎస్‌కు చెందిన సీతారామ్ నాయక్ 34,992 ఓట్ల మెజార్టీతో.. 2019లో బీఆర్ఎస్‌కు చెందిన మాలోత్ కవిత 1,46,663 ఓట్ల మెజార్టీలతో విజయం సాధించారు. కాగా తాజా లెక్‌సభ ఎన్నికల్లో మంత్రి తుమ్మల అన్నీ తానై చేసి వ్యూహా ప్రతి వ్యూహాల మూలంగా భద్రాచలం మొదలుకొని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో దాదాపు మూడున్నార లక్షల ఓట్ల మెజార్టీ సాధించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాలపై ఆయన పట్టు నిరూపితమైంది.

ప్రోత్సాహకాలు అందేదెన్నడో?

» డీఆర్‌డీఏలో రెగ్యులరైజ్డ్ ఉద్యోగుల అవస్థలు » పే ఫిక్సేషన్ జరిగినా అందని డబ్బులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 7: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో రెగ్యులరైజ్ అయిన క్రమబద్ధీకరణ ప్రోత్సాహకాలు అందుకోగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం డీఆర్‌డీఏ అధి కారుల దయాదాక్షిణ్యాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో 1993లో టైం స్కేల్ విధానంలో 75 మంది ఉద్యోగాలు పొందారు. టైం స్కేల్ నుంచి వీరిని గత బీఆర్ఎస్ ప్రభు త్వంలో రెగ్యులరైజ్ (క్రమబద్ధీకరణ) చేశారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లగా క్రమబద్ధీకరణ పొందిన ఉద్యోగులకు అనుకూలంగా 2022న హైకోర్టు తీర్పుని చ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడుగురు ఉద్యోగులు మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులను ఆయా జిల్లాల కలెక్టర్లు, డీఆర్‌డీఏ అధి కారులు రెగ్యులరైజ్ చేసి వేతనాలను, ఇతర ప్రోత్సాహకాలను అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఏడుగురు ఉద్యోగుల్లో ఖమ్మం జిల్లాలో ఐదుగురు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరు పనిచేస్తున్నారు. వీరిలో ఖమ్మం డీఆర్ డీఏ డ్రైవర్‌గా పనిచేసిన ఉద్యోగి నవంబరులో మరణించారు. మరో డ్రైవర్ కలెక్టరేట్‌లో పనిచేసి పదవీ విరమణ పొందారు. మిగిలిన వారిలో ఒక డ్రైవర్ జడ్పీ చైర్మన్ వద్ద ప్రస్తుతం పనిచేస్తుండగా మిగిలిన ఉద్యోగులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరికి క్రమబద్ధీకరణ జరిగినా వేతనాలు అందటం లేదు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారికి డ్రైవర్‌గా పనచేసిన వ్యక్తి మరణించి ఆరు నెలలైనా మృతుని కుటుంబ సభ్యు లకు కనీసం ఫించన్ ఇవ్వలేక పోయారు. నవంబర్ 2023న డ్రైవర్ ఆలయర్ ఖాన్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో కన్నుమూశారు. బాధిత కుటుంబానికి వెంటనే అధికారులు పింఛన్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ మే 7 వరకు మృతిచెందిన డ్రైవర్ ఈపీఎఫ్ ఖాతా ఆన్‌లైన్ జరగలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రోజు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయానికి ప్రదీక్షణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏడుగురు ఉద్యోగులను రెగ్యుల రైజ్ చేసిన తర్వాత వారికి ప్రోత్సాహకాల ఏర్పాటుకు ప్రభుత్వం సుమారుగా రూ.3కోట్ల బడ్జెట్‌ను సైతం బ్యాంకు ఖాతాలో ఉన్నట్లు సమాచారం. ఇరు జిల్లాల కలెక్టర్లు స్పందించి ప్రోత్సాహకాలను ఇవ్వాలని ఉద్యోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

త్వరలో పరిష్కరిస్తాం: అనురాధ, డీఆర్‌డీఏ, పరిపాలన అధికారి

ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల వారికి రెగ్యూలర్ వేతనాలు అందటం లేదు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య ప్రత్యేకంగా ఫైల్‌ను పరిశీలిస్తున్నారు. త్వరలో పరిష్కారం జరుగు తుంది. మరణించిన డ్రైవర్ ఆలీయర్ ఖాన్‌కు బ్యాంకు ఇబ్బందులు కారణంగా ఈపీఎఫ్ ఆన్‌లైన్ కాలేదు. త్వరలో న్యాయం చేస్తాం.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసార్చన



భద్రాచలం, జూన్ 7: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ఆర్జిత సే వలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నా రు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి ని త్యకల్యాణం వైభవంగా జరగ్గా 34 జంటలు పాల్గొన్నారు.

నేటినుంచి ఈ సెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్

చుంచుపల్లి, జూన్ 7: ఈ సెట్ 2024 ఆన్‌లైన్ కౌన్సిలింగ్ శనివారం నుంచి ప్రారంభమౌ తుందని రుద్రంపూర్ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగమునినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ నెల 12 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో స్లాట్‌లు బుక్ చేసుకో వాలని 14వ తేదీ వరకు ఆప్షన్స్ ఇవ్వాలని తెలిపారు. 14వ తేదీన సీట్ల కెటాయింపు జరుగు తుందని అన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు సంబంధిత కళాశాలలో ఈ నెల 18న సీట్లు పొందుతారని అన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని సూచించారు. అదేవిధంగా సీట్లు రాని అభ్యర్థులు ఫైనల్ ఫేస్ కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు సకాలంలో వెరిఫకేషన్ సెంటర్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

ముగిసిన బెస్ట్ అవైలబుల్ పాఠశాల ప్రవేశాల దరఖాస్తుల గడువు

చుంచుపల్లి, జూన్07: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2024 - 25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో సీట్లు భర్తికి ప్రవేశాల దరఖాస్తుల ప్రక్రియ ముగిసిందని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని డి.అనసూర్య శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఒకటవ తరగతి ప్రవేశాలకు మూడు పాఠశాలలో 66 సీట్లు (నాన్ రెసిడెన్షియల్) ఉండగా 75 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఐదవ తరగతి ప్రవేశాలకుగాను ఒక పాఠశాలలో 69 సీట్లకు(రెసిడెన్షియల్) గాను 88 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గత నెల మే 17వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయం, ఐడీవోసీలోని షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లాటరీ ప్రక్రియ ద్వారా సీట్లుకు విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. సకాలంలో హాజరు కావాలని కోరారు.

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ నిర్వహణ

» అంతటా పైపులైన్ల లీకేజీ



పాలడుగులో ఆరునెలల నుంచి ఓ రైతుపొలంలో ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

వైరా, జూన్ 7: మిషన్ భగీరథ తాగునీటి పథక నిర్వహణ అత్యంత అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా మిషన్ భగీరథ పథకానికి చెందిన పైపులైన్లు లీకులమయంగా తయారయ్యాయి. గతంలో ఉన్న బోడేపూడి సుజల ప్రవంతి మంచినీటి పథకానికి చెందిన పైపులైన్లను డమ్మీ చేసి కాసుల కోసం కక్కుర్తి పడి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన మిషన్ భగీరథ పైపులైన్లు అన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూర్వపు పైపులైన్లు లీకేజీ ఏడాదికి ఒకసారి ఒకట్రెండు చోట్ల జరిగితే ఇప్పుడు భగీరథ పైపులైన్ల లీకేజీ నిత్యకృత్యంగా మారింది. పైపులైన్ల లీకేజీ కారణంగా మురుగునీరు పైపుల్లో చేరి కలుషిత మంచినీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అనేక గ్రామాల ప్రజలు దుర్వాసన వెదజల్లుతున్న భగీరథ నీటితో భయకండిపి తులవుతున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు కొనసాగించడమేకాకుండా జనరద్దీ అధికం గా ఉండే జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద వైఎస్సార్ విగ్రహం ముందు రెండునెలల కిందట పైపులైన్ లీకేజీ అయి ప్రతిరోజూ భారీగా భగీరథ నీరు వృథాగా పోతుంది. వైరా నడిబొడ్డున పైపులైన్ లీకేజీ అవుతూ మురుగు గుంతగా తయారై పాకుడు ఏర్పడింది. వైరా-సోమవరం గ్రామాల మధ్య ఇందిరమ్మ కాలనీ సమీపంలో భగీరథ పైపులైన్ లీకై సోమవరం గ్రామానికి దుర్వాసనతో కూడిన మురుగునీరు సరఫరా అవుతుంది. అలాగే గౌండ్లపా లెం-నారపనేనిపల్లి గ్రామాల మధ్య భగీరథ పైపులైన్ లీకవుతూ కలుషితమైన మంచినీరు వస్తుండటంతో నారపనేనిపల్లి, విప్పలమడక, లింగన్నపాలెం తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే మండలంలో అష్టగుర్తి గ్రామ సమీపంలో గత ఆరునెలల నుంచి 700డయా పైపులైన్ లీకవుతూ వృథాగా నీరు పొలాల్లో ప్రవహిస్తుంది. కొణిజర్ల మండలంలోని తనికెళ్ల గ్రామ సమీపంలో ముక్రీహిల్స్‌పై ఉన్న మిషన్ భగీరథ పథకం నుంచి పొద్దుటూరు, అష్టగు ర్తి గ్రామాల ద్వారా ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాలకు 24గంటలు తాగునీరు సరఫరా అవుతుంది. పైపులైన్ లీకేజీ ద్వారా ఆరునెలల నుంచి నిత్యం వేలాది లీటర్ల తాగునీరు గుత్తా రాంబాబు అనే రైతుపొలంలో ప్రవహిస్తుండటంతో భూమి ఆరక, పంటలు పండక తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ అధికారులు తమకు నష్టపరిహారం చెల్లించాలని రాంబాబు కోరుతున్నారు. ఈ పైపులైన్ల లీకేజీలు మచ్చుకు కొన్నిమా త్రమే ఇంకా లెక్కకు మించి గ్రామాల్లో పైపులైన్లు లీకవుతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

వైరా మునిసిపాలిటీ 13వ వార్డులో చోరీ



చిందరవందర చేసిన వస్తువులు

వైరా, జూన్ 7: వైరా మునిసిపాలిటీ 13వ వార్డులోని తాళ్లూరి సందీప్‌కు చెందిన నివాసంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బీరువాలను పగులగొట్టి వస్తువులను చిందరవందర వేసి బంగారం, వెండి వస్తువులు, కొంత నగదు, ఎల్‌ఈడీ టీవీని అపహరించుకుపోయారు. నాలుగురోజుల క్రితం సందీప్ కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్నవారు సందీప్ ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి వెంటనే ఆయనకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వైరా వచ్చిన సందీప్ తన ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనాస్థలాన్ని సందర్శించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



నటరాజ్ (ఫైల్)

తల్లాడ, జూన్ 7: ఆర్థిక ఇబ్బందులతో తల్లాడ మండ లం అన్నారుగూడెం గ్రామంలో గోవిందు నరేష్ అలియాస్ నటరాజ్ (35)అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం రాత్రి నరేష్ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మార క స్థితిలో ఉన్న నగేష్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిట ల్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం నరేష్ మృతిచెం దాడు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ఖమ్మం క్రైం, జూన్ 7: అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్‌లో నివాసం ఉండే ఆర్.కోటేశ్వరరావు (52) ఎర్రుపాలెంలో హెడ్ కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 25న ఊపిరితిత్తులల్లో సమస్య రావటంతో హైదరాబాదు లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొం దుతు న్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రి లోనే మృతి చెందారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీ సులకు ఫిర్యాదుచేయటంతో వారు కేసు నమోదుచేశారు.

చికిత్స పొందుతూ కండక్టర్ మృతి



రామారావు (ఫైల్)

కొణిజర్ల, జూన్7: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కండక్టర్ మృతి చెందాడు. మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన పేరసాని రామారావు(58) కొత్తగూడెం డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి తనికెళ్లలో నడుచుకుంటు వెళుతున్నాడు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరి ఫిర్యాదు మేరకు ఎస్ శంకరరావు కేసు నమోదు చేశారు. అనారోగ్యం కారణంగా ఆయన సెలవులో ఉన్నాడు. ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, కొప్పుల కృష్ణయ్య, తాళ్ళపల్లికృష్ణ, అన్నారపు వెంకటేశ్వర్లు, కళ్యాణపు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పీవిరావు, యాసా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు చింతనిప్పు నరసింహరావు, మిట్టపల్లి శ్రీనివాసరావు, గడల నరేందర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

రూ.6 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల పట్టివేత



భద్రాచలం, జూన్ 7: భద్రాచలం లో శుక్రవారం పలు దుకాణాల్లో ప ట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రూ.6 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకు న్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్లను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడి మృతి

ఏన్కూరు, జూన్ 7: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి అక్కినాపురంతండా గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తల మీదనుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయింది. మృతిచెందిన యువకుడు సుమారు 35 ఏళ్ల వయస్సుంటుందని గుర్తించారు. ఒంటిపై మెరూన్ కలర్‌చొక్కా, నల్లజీన్‌ప్యాంట్ ధరించాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

● అడ్డొచ్చిన వదినకు గాయాలు

తల్లాడ, జూన్ 7: భూతగాదాల వల్ల అన్నపై హత్యాయత్నం.. అడ్డొచ్చిన వదినపై దాడిచేసిన సంఘటన గురువారం రాత్రి తల్లాడ మండలం వెంకటాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వెంకటాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములైన నేలవల్లి వెంకటేశ్వరరావు, నర్సింహారావుల మధ్య భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇల్లెందులో నివాసముంటున్న సింగరేణి ఉద్యోగి అయిన నేలవల్లి నర్సింహారావు ఇల్లెందు నుంచి మరికొంతమందితో కలిసి గురువారం రాత్రి వెంకటాపురం వచ్చి అన్న వెంకటేశ్వరరావు ఇంట్లోకి చొరబడి మూకుమ్మడిగా వెంకటేశ్వరరావుపై ఇనుపరాడ్డుతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో వెంకటేశ్వరరావు తల, కుడికంటికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డొచ్చిన వెంకటేశ్వరరావు భార్య సత్యావతిపై కూడా దాడిచేయడంతో ఆమె కుడిచేయి, తలకు గాయాలయ్యాయి. సత్యావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైఓల్టేజీతో విద్యుత్ పరికరాల దగ్ధం

దుమ్ముగూడెం జూన్ 7: శుక్రవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ హై ఓల్టేజీ రావడంతో దుమ్ముగూడెం గ్రామంలోని రూవేలాదిల విలువగల విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి. రిఫ్రిజిరేటర్లు, టీవీలు, బల్బులు, మిక్సీలు కాలిపోయాయి. విద్యుత్ పరికరాల్లో నుంచి పొగలు రావడంతో వినియోగదారులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా లోపంతో జరిగిన నష్టానికి తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమ్పై ఏఈ మోహన్‌రెడ్డిను వివరణ కోరగా, విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మ పడడంతో హైఓల్టేజీ వచ్చే అవకాశం ఉందని, వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు.

'కోణార్క్'లో గంజాయి పట్టివేత

● పట్టుబడిన ఎండు గంజాయి విలువ రూ. 10 లక్షలు



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో ఎక్సైజ్‌శాఖ అధికారులు


ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 7: ఒరిస్సా, భువనేశ్వర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణాపై ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులు దృష్టి పెట్టారు. శుక్రవారం కోణార్క్ రైలులో ఖమ్మం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా ఉన్న సంచులను పరిశీలించగా వాటిలో రూ.10లక్షల విలువైన 23 కేజీల ఎండు గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. అయితే ఎక్సైజ్ అధికారులు రైలులో తనిఖీలు చేసిన విషయాన్ని గమనించిన గంజాయి ముఠా తప్పించుకున్నారు. తనిఖీల్లో పాల్గొన్న సీఐ సుంకరి రమేశ్, హరీష్, వెంకట్, హన్మంతరావు, సుధీర్, విజయ్, బేబీ లను ఎక్సైజ్‌శాఖ జిల్లా ఉన్నతాదికారులు అభినందించారు. తనిఖీలో ఇలానే కొనసాగించాలని సూచించారు.

ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్


ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 7: ఖమ్మం నగరంలోని యువతకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్ ఆఫీసర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పట్టుకొని రిమాండ్‌కు పంపారు. శుక్రవారం సీఐ చంద్రమోహన్ తన బృందంతో కలిసి ఖమ్మంలో తనిఖీలు చేపట్టగా అనుమానస్పదంగా ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రీనివాసనగర్‌కు చెందిన చేకూరి శ్రీనును గుట్టుగా వెంబడించారు. ఈ క్రమంలో ఓ యువకుడుకు 100 గ్రాముల గంజాయిని అమ్మకం చేస్తుండగా చేకూరి శ్రీనును పట్టుకొని ద్వీ చక్ర వాహనంతో సహా కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఎస్సెస్పీ భూమి ఆక్రమణపై లోకయుక్తాలో ఫిర్యాదు

ఖమ్మం రూరల్, జూన్ 7: ఖమ్మం రూరల్ మండలం, ముత్తగూడెం రెవెన్యూ పరిధిలోని గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్నెస్పీ భూమి ఆక్రమణకు గురైందని స్థానిక రాజకీయ నాయకులు అధికారులతో కుమ్మక్కై రూ.కోట్ల విలువ చేసే భూమిని అనధికారికంగా అమ్ముకున్నారంటూ కొందరు వ్యక్తులు శుక్రవారం లోకాయుక్తాలో ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన ఎన్నెస్పీ భూమి విలువ సుమారు రూ.50 కోట్ల పైగా ఉంటుందని అంచనా. ఈ భూమిలో కొన్ని అనధికారిక వెంచర్లు ఏర్పాటు చేసినట్లు కూడా తెలుస్తుంది.



22న శ్రీ కోదండ రామాలయ స్వర్ణోత్సవం



సత్తుపల్లి,జూన్7: సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం స్వర్ణోత్సవాన్ని ఈనెల 22 నుంచి 2రోజుల పాటు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ బాధ్యులు తెలిపారు. 22న మూల విరాట్‌లకు అభిషేకం, పుష్పయాగం, 23న హనుమాన్ చాలీసా, శ్రీ సీతారామ కల్యాణం, శ్రీ శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసకల్యాణం, 24న శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నారు. స్వర్ణోత్సవం సందర్భంగా స్వామి వారికి అద్భుత శాంతి మహా సంప్రోక్షణ నిర్వహించనున్నామని, 24న జరిగే నారాయణసేవ స్వామివారి ఊరేగింపులో పాల్గొవాలని కోరారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, మే 7: రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం కూసుమంచి మండలంలో పర్యటిస్తారని క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8:30 గంటలనుంచి సాయంత్రం 7:00 గంటల వరకు వివిధ గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు,. నాయకన్‌గూడెం, భగత్‌వీడుతండా, మంగలితండ, ఈశ్వరమాధారం, రాజుపేట బజార్, రాజుపేట, గోరీలపాడుతండ, అజ్మీరా హీరామాన్‌తండ, పెరికశింగారం, జక్కేపల్లి, మల్లేపల్లి, గట్టుసింగారం, గంగబండతండ, లింగారంతండ, కోక్యాతండ, లోక్యాతండ, నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ప్రజలు నేరుగా కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చని సూచించారు.

ఏఐటీయూసీది కార్మికులపక్షం

సత్తుపల్లిరూరల్, జూన్7: సింగరేణి వ్యాప్తంగా కార్మికుల పక్షాన నిలబడుతూ వారి సమస్యల పరిష్కరిస్తామని ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి వంగా వెంకటేశ్వరరావు, కేజీఎం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య అన్నారు. శుక్రవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో పర్యటించి పీవో ప్రహ్లాద్‌ను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం జేవీఆర్ ఓసీలో ఎస్‌అండ్‌ఎం విభాగం ఫిట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాటం రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ నరసింహారావు, బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్‌ప్రెసిడెంట్ దారా భీమయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి పీ.సూర్యప్రకాషరావు, బరిగల శేఖర్, ప్రసాదరావు, షిఫ్ట్ ఇన్‌చార్జీలు, డెలిగేట్స్, కౌన్సిల్ మెంబర్స్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ డిస్పెన్సరీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయ షాపుల వేలం వాయిదా

నేలకొండపల్లి,జూన్7:నేలకొండపల్లిలోని శ్రీభీమేశ్వరస్వామి దేవాలయ షాపుల అద్దె వేలం వాయిదా పడింది. శుక్రవారం ఆవరణలో జరగాల్సి ఉంది. నిర్ణీత సమయానికి అధికారులు వచ్చినప్పటికీ, వేలంలో పాల్గొనటానికి నిబంధనల ప్రకారం వ్యక్తులు రాకపోవటంతో వేలం వాయిదా వేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

తిరుమలాయపాలెం, జూన్7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలను అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదరిశ నున్న నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు బుగ్గవీటి సరళ, యర్రా శ్రీనివసరావు బషిరుద్దీన్, మండల కార్యదర్శి శ్రీను, దొడ్డా లింగస్వామి, అంగిరేకుల నరసయ్య, మద్దినేని శ్రీనివాస్, పల్లి రమేష్, నేర్సుల వెంకటేష్, బండారు సైదులు తదితరులు పాల్గొన్నారు.

12లోగా విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి జూన్7: 2024-24 వార్షిక విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సులలో చేరే విద్యార్థులు మెదటి విడత ప్రవేశాలకు సంభందించి సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 12లోగా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. విద్యార్థులు సకాలంలో నమోదు చేయకపోతే సీటు కోల్పోతారని తెలిపారు. రెండో విడత ప్రవేశాలకు ఈనెల 13లోగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. 14 వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్7: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని యూటీఎఫ్ నాయకులు కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు మాట్లాడారు. తెలుగు మీడియం తరగతులు పూర్తిగా ఎత్తివేయటం తగదని అన్నారు.

మూల్యాంకన నగదు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్7: ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల నిర్వాహణలో పాల్గొన్న వారికి పెండింగ్ మూల్యాంకన నగదు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంటర్ మూల్యాంకన కేంద్రం నయాబజార్ కేంద్రం వద్ద తెలంగాణ గెజిగెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోషియేషన్ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, వినోద్ బాబు ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మిడాయట్ అధికారికి వినతిపత్రం అందించారు.

డ్రైడేపై అవగాహన

కల్లూరు,జూన్7: వైద్యాధికారి వి.నవ్యకాంత్ ఆధ్వర్యంలో కల్లూరు మండలంలో శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండి దోమల ద్వారా డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ప్రజలు స్వచ్ఛందంగా డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత జాడీలు, పగిలిపోయిన కుండలు, పూలకుండీలు, కూలర్లు, పాత టైర్లు, వాడని రోళ్ల తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు.

డీఈఈసెట్ దరఖాస్తుకు జూన్ 30వరకు గడువు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్7:డీఈఐఈడి, డీపీఎస్‌ఈల్లో ప్రవేశాల కొరకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల8నుంచి 30 వరకు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష జూలై 10న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ఎర్రుపాలెం,జూన్7: మండలంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా చేయించుకోవాలని మధిర డివిజన్ శ్రీసాయి వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ దోసపాటి కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌ను గ్రాస్ కనెక్షన్ లింక్ చేయించుకోవాలని కోరారు. ఈనెల 30 వరకు మాత్రమే ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేసునేందుకు గడువు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈకేవైసీ లేకుంటే వినియోగదారుల గ్యాస్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కొత్తపైపులు తమ సిబ్బందివద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సీపీఎం నాయకుడు రమేష్‌కు ఘననివాళి

తిరుమలాయపాలెం, జూన్7: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ నాయకులు కాంపాటి రమేష్‌కు శుక్రవారం వివిధ పార్టీల నేతలు ఘణనివాళులర్పించారు. రమేష్ గతనెల 31తేదీన రోడ్డుప్రమాదంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా ఆయన అంత్యక్రియలు పిండిప్రోలులో శుక్రవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, దొండేటి ఆనందరావు, దొడ్డ లింగస్వామి, వెంకటేశ్వర్లు, పద్మనాభలు సుధాకర్, వశపోగు వీరన్న నివాళులర్పించారు.

ప్రజాతంత్ర శక్తుల బలోపేతమే సీపీఎం లక్ష్యం

పెనుబల్లి,జూన్7: ప్రజాతంత్ర శక్తులు బలపడేందుకు పార్టీ కార్యకర్తలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. లంకపల్లిలో శుక్రవారం జరిగిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రస్తుత ఆర్థిక విధానాలపై భారతి బోధించారు. కార్యక్రమంలో చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, గుడిమెట్ల బాబు, చలమాల నర్సింహారావు, చలమాల అరుణ్‌ప్రతాప్, శెట్టిపల్లి నాగమణి, కండే సత్యం, తడికమళ్ల చిరంజీవి, కొప్పుల వెంకటేశ్వరరావు, మామిళ్ల సోమయ్య పాల్గొన్నారు.

జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

ఖమ్మంఖానాపురంహవేలీ,జూన్7: జిల్లాలో జర్నలిస్ట్ పిల్లలకు ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్)ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మిడియట్ అధికారి కె రవిబాబు, జిల్లా విద్యాశాఖఅధికారి సోమశేఖర శర్మలను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



పత్తి సాగుపైనే మక్కువ

- మధిరలోడివిజన్‌లో 75వేల ఎకరాల్లో సాగు
- విత్తనాలు కొరత లేదు : ఏడీఏ



పత్తి సాగుకు పొలం దుక్కిదున్ని చదును చేసుకుంటున్న రైతులు

మధిర, జూన్7: మధిర డివిజన్‌లో ఈఏడాది పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముందుగానే రుతుపవనాలురావడం, దుక్కులు సిద్ధం చేసుకున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు మాగాణి, మిరప పొలాల్లో జీలుగులు చల్లుకుంటున్నారు. గతంలో అపరాల సాగుచేసిన రైతులు సైతం ఈ ఏడాది పత్తి సాగు పట్ల మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా ఈ ఏడాది ముందుగానే జీలుగలు, జనుములు విత్తనాలు రైతులకు ఇవ్వడంతోపాటు పత్తి విత్తనాలను అన్ని మండలాల్లో సరిపడా స్టాకులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పత్తి జిల్లాలో 2 లక్షల సాగు అవుతుంటే అందులో మధిర డివిజన్‌లోనే అత్యధికంగా 74,269 ఎకరాల్లో సాగవుతుంది. అందుకు అనుగుణంగా రైతులు తమ పొలాలను సన్నద్ధం చేశారు.

మధిర డివిజన్‌లోనే అత్యధిక సాగు

మధిర డివిజన్‌లో ఈఏడాది వానాకాలంలో మొత్తం 1,45,575 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతుందని అంచనా వేశారు. అందులో పత్తి అత్యధికంగా 74,269 ఎకరాల్లో సాగవుతుందని, వరి పంట 42,500 ఎకరాల్లో, మిర్చి పంట 19,485 ఎకరాల్లో సాగుఅవుతుందని అంచనాలు తయారు చేశారు. అలాగే మొక్కజొన్న పంట 1,628 ఎకరాల్లో సాగవుతుంది. పెసలు 5,893 ఎకరాల్లో, కందులు 406 ఎకరాల్లో, మినుములు 183 ఎకరాల్లో, చెరకు 168 ఎకరాల్లో, శనగ 43 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనాలు రూపొందించారు.

పత్తి విత్తనాలు 43,386 ప్యాకెట్లు సిద్ధం:

మధిర డివిజన్‌లో పత్తి సాగుకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో అవసరమైన పత్తి విత్తనాలను సిద్ధం చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో రైతుల అవసరాలకు సరిపడా విత్తనాలు సరఫరా జరుగుతుంది. ఇప్పటికే డివిజన్‌లో పత్తి విత్తనాలకు కొరత ఏర్పడకుండా 43,386పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. మధిర మండలంలో 10,766 ప్యాకెట్లు, బోనకల్ మండలంలో 14,874 ప్యాకెట్లు, ఎర్రుపాలెం మండలంలో 6,986 ప్యాకెట్లు, చింతకాని మండలంలో 8,783 ప్యాకెట్లు, ముదిగొండ మండలంలో 1977 ప్యాకెట్లు నిల్వలు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

విత్తనాల కొరత లేదు
ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు

మధిర డివిజన్‌లో రైతులు విత్తనాలకు కొరత లేదు. రైతులు ఆందోళన చెందవద్దు. డివిజన్ లోని అన్ని మండలాల్లో పత్తి విత్తనాలు అందించాం. రైతులు లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

రఘునాథపాలెంలో జోరందుకున్న సాగు



గింజలు నాటుతున్న రైతులు, కూలీలు

రఘునాథపాలెం: వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురియటంతో పత్తి సాగుకు రైతులు సై అంటున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 34వేల ఎకరాల్లో సాగులో ఉంది. వాటిలో పత్తి 34వేల ఎకరాలు, మిర్చి 18వేల ఎకరాలు, వరి 10వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. వీటితో పాటుగా ఇతర వాణిజ్య పంటలు, కూరగాయల సాగు రైతులు చేస్తుంటారు. రైతులకు అందుబాటులో ఇప్పటికే 5వేల ప్యాకెట్లు పత్తి విత్తనాల ను అధికారులు అందించారు. అయితే వాతావరణం అనుకూలంగా ఉందంటూ మండలంలోని రైతులు పత్తి విత్తన సాగును షురు చేశారు. శుక్రవారం నాటికే 200 ఎకరాల వరకు పత్తి విత్తనాలను నాటారు. మరో రెండు రోజులు వర్షాలు పడితే పత్తి మొక్కలు వస్తాయి అంటూ రైతులు ఆశతో పత్తి సాగును ప్రారంభించారు. అయితే మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాత్రం పత్తి సాగుకు తొందరపడోద్దని సలహా ఇచ్చారు. కనీసం రెండు దుక్కుల వర్షం, 60 ఎంఎం వర్షపాతం నమోదు జరిగిన తర్వాతనే విత్తుకోవాలని సూచనలు చేస్తున్నారు.

విత్తనాల అమ్మకాల్లో
నిబంధనలు పాటించాలి

డీఏవో విజయనిర్మల



తనిఖెళ్లలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో

కొణిజర్ల,జూన్7: విత్తనాల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిని విజయనిర్మల హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తనికెళ్ళలో విత్తన తనిఖీలో భాగంగా విత్తన దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. జిల్లాలోని విత్తన డీలర్‌లకు సంబందించి మాట్లాడుతూ విత్తన షాపుల్లో స్టాక్‌రిజిస్టర్, బిల్‌బుక్స్, ఇన్వాయిస్, గాట్‌కాపిలో పెట్టుకోవాలని సూచించారు. విత్తనచట్టం ప్రకారం రైతులకు విధిగా తీసుకున్న విత్తనాలకు రసీదు ఇవ్వాలని, ఆ రషీదు మీద రైతు పూర్తిపేరు, ఫోన్‌నెంబర్, తయారు అయిన తేదీ, విత్తన గడువు ఎప్పటిక వరకు ఉందో రైతు సంతకం, డీలర్ సంతకం అన్ని ఉండాలని తెలిపారు. రైతులు బిల్లులను పంట చివరివరకు దాచుకోవాలని కోరారు. డీలర్‌లు ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలు అమ్మాలని చెప్పారు. ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు ఉంటాయన్నారు. ప్రతి డీలర్ షాపులో స్టాక్‌బోర్డు తెలుగులో రాసి పెట్టాలని సూచించారు. రైతులు అన్ని విత్తనాలలో ఒకే రకము బీటిజిన్ ఉంటుందని గ్రహించాలన్నారు. కేవలం సస్యరక్షణ చర్యలు వలనే దిగుబడుల్లో వ్యత్యాసాలు వస్తాయన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై పీడీచట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఏడీఏ కరుణశ్రీ, మండల వ్యవసయాధికారి బాలాజి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు ఉచితంగా అందించాలి

ఖమ్మంరూరల్, జూన్7: దళిత, గిరిజన రైతులకు ఎరువులు, విత్తనాలు, పురగు మందులు ఉచితంగా అందించాలని ఏపీపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల వెంకయ్య, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

స్మశానాల్లో ఆక్రమణ భూతాలు !



గొల్లగూడెంలో అంత్యక్రియలు నిర్వహించలేకపోవడంతో వేరే ప్రదేశంలో ఉంచిన మృతదేహం

ఖమ్మంకార్పొరేషన్, జూన్7: జీవితంలో చివరి మజిలీ అంత్యక్రియలు. ఇందుకోసం కేటాయించిన స్మశాన వాటికలు ఆక్రమణలకు గురికావటంతో మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అధికారులు స్మశానవాటికలకు స్థలాలు కేటాయించినా వాటికి హద్దులు పెట్టటం లేదు. స్మశానవాటికలుగా రికార్డుల్లో నమోదు చేయటంలేదు. ఫలితంగా అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నగరంలోని గొల్లగూడెంలో ఇటీవల జరిగిన సంఘటన పరిస్థితికి అద్దంపడుతుంది. 14వ డివిజన్ గొల్లగూడెంలోని చెరువు శిఖం భూమిని రెవెన్యూ అధికారులు స్మశాన వాటికకు కేటాయించారు. సర్వే నెంబరు 546లో సుమారు 3ఎకరాల స్థలం శ్మశానవాటిక నిమిత్త కేటాయించినప్పటికీ హద్దులు ఏర్పాటు చేయలేదు. దీంతో సదరు స్థలం ఆక్రమణలకు గురైంది. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్నితీసుకెళితే ఆ స్థలం పట్టా భూమి అని, అంత్యక్రియలు చేయడానికి వీల్లేదని కొందరు అభ్యంతరం పెట్టారు. చేసేదేమి లేక వేరేస్థలంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు తరుచు జరుగుతున్నాయి.

ప్రతీచోటా వివాదమే..

నగర పరిధిలో పలు ప్రాంతాల్లో అంత్యక్రియల విషయంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా విలీన పంచాయితీల్లో సమస్యలు నెలకొన్నాయి. 14వ డివిజన్ కొత్తగూడెంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించినా, చుట్టూ ఫెన్సింగ్ వేయకపోవటం, ఆ స్థలాన్ని శుభ్రం చేయకపోవటంతో ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని తీసుకువెళితే ఆక్రమణదారులు ఇబ్బందులు పెడుతున్నారు. 59వ డివిజన్ రామన్నపేటలో ఇదే పరిస్థితి. ఇక్కడ 1-28ఎకరాల ప్రభుత్వభూమిని శ్మశానవాటిక నిమిత్తం కేటాయించారు. సదరు స్థలం చుట్టూ స్తంభాలు పాతితే, అక్రమార్కులు వాటిని తొలగించి, శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు.దీంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. రెవెన్యూ అధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లటంతో వారు ఆక్రమార్కులన హెచ్చరించి, సదరు స్థలం శ్మశాన వాటికకు కేటాయించామని పేర్కొన్నారు. అయినప్పటికీ అంత్య క్రియల విషయంలో వివాదాలు చోటు చేసుకుం టున్నా యి. ఆక్రమణదారులు అడ్డుకుంటూనే ఉన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి, శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, వాటిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. అంత్య క్రియలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగు భూమి ఆక్రమణలపై సర్వే



కల్లూరు, జూన్7: కల్లూరు మండలంలోని అటవీప్రాంతంలో ఉన్న వంకర వాగు భూమి ఆక్రమణపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. శుక్రవారం తహసీల్దార్ సాంబశివుడి ఆదేశాల మేరకు సర్వేయర్ అశోక్ సిబ్బందితో క్షేత్రస్థాయిలో వాగు హద్దులను పరిశీలించారు. వంకర వాగు పరివాహక ప్రాంత సమీపాన ఉన్న భూయజమానులు వాగుకు ఇరువైపులా ఉన్న వేలాది ఎకరాల భూమిని ఆక్రమించారని ఫిర్యాదులున్నాయి. దీనిపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక స్థాయిలో వాగు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో వాగు పరివాహక ప్రాంత సర్వే నిర్వహించే అవకాశముంది. సర్వేలో వెల్లడైన ఆక్రమణ వివరాలను బట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

పంటకాల్వల్లో పూడిక తొలగించాలి

తల్లాడ, జూన్ 7: నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన మండలపరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిల్లుపాడు ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మం మాట్లాడుతూ ఎన్నెస్పీ తెలగవరం మైనర్ కాల్వలో పూడిక పేరుకుపోయిందని, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నెస్పీ సిరిపురం మేజర్ కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మన ఊరు-మనబడి కింద ఎంపికైన తల్లాడ హైస్కూల్, బస్వాపురం, ప్రాథమిక పాఠశాల ఆవరణాల్లో వర్షం కురిస్తే రోజులతరబడి వరదనీరు నిల్వ ఉండి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న దృష్ట్యా మట్టితో నింపి ఆవరణాల ఎత్తు పెట్టాలని తల్లాడ, కలకొడిమ ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, ఆదూరి వెంకటేశ్వర్లు కోరారు. మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ వల్ల మల్సూర్‌తండా వద్ద తాగునీరు వృధాగా ప్రవహిస్తుందని, పలు గ్రామాల్లో వాటర్‌ట్యాంకులకు సరిగా నీరు సరఫరా కాక తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పైపులైన్ల లీకేజీల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. బిల్లుపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో కనీసం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని దీనివల్ల ప్రజలకు వైద్యసేవలందడం లేదని రుద్రాక్ష బ్రహ్మం అన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీవో కొండపల్లి శ్రీధర్, డీఈ శ్రీనివాసరావు, ఎంఈవో ఎన్. దామోదర్‌ప్రసాద్, మండల వైద్యాధికారి రత్న మనోహర్, ఏఈలు అశోక్, అయేషా, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేలకొండపల్లి, జూన్7: మండల పరిధిలోని కొత్తకొత్తూరు సబ్-స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు నేలకొండపల్లి విద్యుత్ ఏఈఈ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొత్తూరు సబ్-స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం సబ్-స్టేషన్ పరిధిలోని నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని పల్లెగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లెగూడెం, రెడ్డిపల్లి, ఇండస్ట్రియల్ ఫీడర్, అగ్రికల్చర్ ఫీడర్, ఆరెకోడు, గోళ్లపాడు, ముత్తగూడెం, సాయిగణేష్‌నగర్, ఆదిత్యనగర్, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఉంటుందన్నారు.

'బడిబాట' ప్రచార బైక్‌యాత్ర ప్రారంభం



యాత్ర నిర్వహిస్తున్న సుధాకర్

కల్లూరు,జూన్7: మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ చేపట్టిన బడిబాట ప్రచార బైక్ యాత్ర శుక్రవారం కల్లూరులో ప్రారంభమైంది. స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈవో ఎన్.దామోదర్ ప్రసాద్ బైక్ యాత్రను ప్రారంభించారు. సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 19 వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మైకు, కరపత్రాల ద్వారా తల్లిదండ్రులను చైతన్యపరుస్తానని చెప్పారు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవిధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పోట్రు మధు, రఘునాథబంజర్ ప్రధానో పాధ్యాయుడు రాయల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.విజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాలొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సత్తుపల్లిరూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 3-6ఏళ్ల లోపు చిన్నారులను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలని కాలనీ పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు రామేశ్వరి, నాగలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, ఆదిలక్ష్మీ, అగర్తలతో పాటు ఆయాలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని ఏన్కూరు, హరిజనవాడ, అంబేద్కర్‌నగర్, టీఎల్‌పేట గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశలలలో చేర్పించాలని ఏన్కూరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.సైదయ్య కోరారు. పదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆవుల నరసయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు,శంకర్‌రావు, సాగి సుఅత, జయలీల, ప్రేమానందం, నాగేశ్వరరావు, పర్వాతీ, వెంకటరత్నరం, వెంకటేశ్వర్లు, బాలశౌరి, సత్యవతి, సీఆర్‌పీ కృష్ణప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది అరుణ, పద్మ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

బనిగండ్లపాడులో బడిబాట

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో గల శీలం రామ్మోహన్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్‌ను
సద్వినియోగం చేసుకోవాలి

వైరా, జూన్7: ఈఏపీఈటీ వెబ్‌కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కౌన్సిలింగ్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం సూచించారు. వైరాలోని న్యూలిటిల్‌ప్లవర్ పాఠశాలలో శుక్రవారం ఎఫ్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెబ్ ఆప్షన్స్‌ను ఎలా ఎంచుకోవాలి, ఏఏ కాలేజీలు, ఏఏ కోర్సులు ఆఫర్ చేస్తున్నది, ఎలాంటి భవిష్యత్ ఉంటుందని, వెబ్‌సైట్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కటాఫ్ ఎంతవరకు ఉంటుందనే తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యూలిటిల్‌ప్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సుబ్రహ్మణ్యం